సాక్షి సూర్యాపేట

సోమవారం। 10। జూలై। 2023



ధాన్యం లారీల పట్టివేత

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న రెండు లారీలను సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. - 8లో



గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం

36°/27°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

భానుపురి (సూర్యాపేట): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని పద్మశాలీ సేవా సమాజ ట్రస్ట్‌లో నగదు బహుమతులు, ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు సూర్యాపేట పద్మశాలీ సేవా సమాజ ట్రస్ట్ అధ్యక్షుడు పెండెం పాండు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతిభా పురస్కారాలకు విద్యార్థులు ఈనెల 27లోపు కుల ధ్రువీకరణ పత్రం, మెమోతో కూడిన దరఖాస్తులను సూర్యాపేటలోని పద్మశాలీ సేవా సమాజ ట్రస్ట్ పీఎస్‌ఆర్ సెంటర్ అందించాలని తెలిపారు. వివరాలకు 8095707552, 9393 510919 నంబర్లను సంప్రదించాలని కోరారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పద్మశాలీ విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టువస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులున్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కొండగడ్డుపుల చందు



బాషబోయిన ప్రవీణ్

తుంగతుర్తి: మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడ్డుపుల చందు, బాషబోయిన ప్రవీణ్‌లు ఈ నెల 28, 29, 30 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో జరగనున్న నేషనల్ కబడ్డీ క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. వీరు ఇటీవల ఇబ్రహీంపట్నంలోని ఫిట్ ఇండియా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు ఎంపికైన చందు, ప్రవీణ్‌లను గ్రామస్తులు అభినందించారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం జరిపించారు. యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అదేవిధంగా క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగు భారం!

- ప్రైవేట్ పాఠశాలల్లో అమలు కాని జీఓ నంబర్ 22
- నర్సరీ, ఎల్‌కేజీల్లోనే కేజీల కొద్దీ పాఠ్యపుస్తకాలు
- స్కూల్ బ్యాగు మోయలేక కుంగిపోతున్న చిన్నారుల లేత భుజాలు
- పర్యవేక్షించని విద్యాశాఖ అధికారులు



సూర్యాపేటటౌన్: తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత స్థానంలో చూడాలని కలలు కంటుంటారు. అందుకు తగినట్టుగానే పిల్లలను ప్రోత్సహిస్తారు. వారి చదువులపై ఎన్నో ఆశలతో మంచి బడుల కోసం అన్వేషిస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా స్కూల్ ఫీజుతోపాటు, డజన్ల కొద్దీ పుస్తకాలు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. దీంతో పసి వయసులోనే చిన్నారులు బండెడు పుస్తకాలు మోయాల్సి వస్తోంది. ఈ పుస్తకాల బ్యాగును మోయలేక వారి లేతభుజాలు కుంగిపోతున్నాయి.

నిబంధనల ప్రకారం..

తరగతి	బ్యాగు బరువు (కేజీల్లో)
1-2	1.5
3-5	2-3
6.7	4
8. 9	4.5
10	5

పెరిగిన పుస్తకాల బరువు

జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు 398 వరకు ఉంటాయి. వాటిలో 40వేల మంది విద్యార్థుల వరకు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఒకప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్ బుక్స్‌తో పాటు ఒక రఫ్‌బుక్ ఉండేది. కానీ ఇప్పుడు సబ్జెక్టుకు ఒక రఫ్‌బుక్‌తో పాటు గైడ్లు, డ్రాయింగ్, స్క్రాప్ బుక్స్, రికార్డులు, డైరీలు కలుపుకుని కిలోల కొద్ది పుస్తకాలను స్కూల్ బ్యాగుల్లో మోసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. రోజు పది కిలోల బరువు కంటే ఎక్కువగానే చిన్నారులు తమ భుజాలపై మోస్తున్నారు. ప్రతిరోజు స్కూల్ బ్యాగులను మోసుకుని ఒకటి, రెండు అంతస్తుల బిల్డింగ్‌లు ఎక్కి క్లాస్‌రూం వరకు వెళ్తుండడంతో చాలా మంది పిల్లలు వెన్ను నొప్పి, జాయింట్ పెయిన్స్ బారినపడుతున్నారు. అదేవిధంగా విద్యార్థుల శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతోంది.

ఎల్‌కేజీ స్థాయిలోనే డజన్ల కొద్దీ పుస్తకాలు..

తరగతులు పెరిగిన కొద్దీ విద్యార్థుల బ్యాగు బరువు కూడా పెరుగుతోంది. సాధారణంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, 1వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక పలక, ఒక నోట్ పుస్తకాలు ఒకటి రెండు ఉంటాయి. కానీ ప్రస్తుతం ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలోనే 20 పుస్తకాలు, నోట్ పుస్తకాలు మోయిస్తున్నారు. పిల్లల బరువులో పది శాతానికి మించిన బరువు వేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. కానీ ప్రభుత్వం పుస్తకాల బరువుకు సంబంధించి నిబంధనలు తీసుకొచ్చినా వాటిని గాలికి వదిలేశారు.

ఎదుగుదలపై తీవ్ర ప్రభావం

అధిక బరువు మోయడంతో పిల్లల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. బరువుతో మానసిక ఆందోళనకు గురవుతారు. త్వరగా అలసిపోయి చదువుపై శ్రద్ధ పెట్టలేరు. నడుము, వెన్ను, కండరాల నొప్పి వచ్చే ఆస్కారం ఉంటుంది. వయసుకు తగిన బరువును మాత్రమే మోయాలి.

– చంద్రశేఖర్, పిల్లల వైద్య నిపుణులు

నిబంధనల ప్రకారమే పుస్తకాలు ఉండాలి

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు పుస్తకాల బరువు ఉండాలి. మూడో తరగతి వరకు 1.5కిలోల పుస్తకాల బరువు ఉండాలి. వివిధ పేర్లతో ఎలాంటి పుస్తకాలు విక్రయించకూడదు. ఇలాంటివి తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– అశోక్, డీఈఓ

2017లో జీఓ..

విద్యార్థుల వీపుపై బండెడు బరువును తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2017లో జీఓ నంబర్ 22ను విడుదల చేసింది. దీని ప్రకారం ఒకటి నుంచి రెండో తరగతి విద్యార్థులకు పుస్తకాల బరువు కిలోన్నర వరకు మాత్రమే ఉండాలి. 3 నుంచి 5వ తరగతి వరకు 2- 3కిలోలు, 6నుంచి 7వ తరగతి వారికి నాలుగు కిలోలు, 8, 9 తరగతులకు 4- 5 కిలోలు, 10వ తరగతికి 5కిలోల బరువు మాత్రమే ఉండాలని సూచించింది. ఎస్‌సీఈఆర్‌టీ ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన పుస్తకాలు వినియోగించాల్సి ఉంటుంది. హోంవర్క్ పేరిట ట్యూషన్లు, స్పెషల్ క్లాసులు పెట్టకూడదు. ఆట, పాటలతో చదువును సాగించాలి. విద్యార్థులకు వాటర్ బాటిల్ బరువు లేకుండా పాఠశాలలోనే మంచినీరు అందించాలి. ఐదో తరగతి వరకు హోమ్ వర్క్ ఉండకూడదని జీఓలో పేర్కొన్నారు. అయినా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జీఓ అమలుకు నోచుకోవడం లేదు.

ముఖ్యమంత్రి పర్యటన స్థలాల పరిశీలన



ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 24న జిల్లాకు రానున్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న జిల్లా కార్యాలయ భవనాలను, బహిరంగ సభా స్థలిని ఆదివారం ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. వీరి వెంట ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్‌రావు, కల్లు గీత కార్మిక సొసైటీ చైర్మన్ పల్లె రవికుమార్ ఉన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న హన్మేష్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్రంలో ఉన్న 20లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ విస్మరించారని టీటీసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం హెచ్- 74 (ఐఎఫ్‌టీయూ అనుబంధం) జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 12లక్షల మందికే సంక్షేమ కార్డులు ఉన్నాయని, మిగతా 8లక్షల మందికి ఏ అవకాశం లేకుండా చేశారన్నారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా అందరికీ కార్డులు ఇవ్వాలన్నారు. తక్షణమే భవన కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, లేదా స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. టీటీసీ జిల్లా నాయకుడు జీవన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, పార్టీ జిల్లా నాయకులు లక్ష్మయ్య, పేర్ల నాగయ్య, వెర్పుల కర్ణాకర్, సుధాకర్, రమేష్, సాయి, అంజయ్య, శ్రీను, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డాక్టర్లు.. ప్రైవేట్‌లో సేవలు

- ధనార్జనే ధ్యేయంగా సొంతంగా క్లినిక్‌ల నిర్వహణ
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉండని సీనియర్ డాక్టర్లు
- జూనియర్లతోనే ఓపీ సేవలు కొనసాగింపు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

సూర్యాపేట పట్టణ పరిధిలోని కుడకుడకు చెందిన రాజేశ్వరి ఇటీవల తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఓపీ రాయించుకుని ఎండీ ఫిజీషియన్ వైద్యుడి గదికి వెళ్లింది. ఎండీ ఫిజీషియన్ స్థానంలో ఇద్దరు జూనియర్ వైద్యులు ఉండడంతో వారికే చూపించుకుని మందులు తీసుకుని వెళ్లింది. ఇలా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని విభాగాల సీనియర్ వైద్యులు ఓపీల్లో కూర్చోకుండానే కాలం వెల్లదీస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సూర్యాపేట: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, పీహెచ్‌సీలు, ఏరియాస్పత్రుల్లో సరిపడా వైద్యులు ఉన్నా.. నిరుపేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే ప్రతి వైద్యుడికి ప్రైవేట్ క్లినిక్ లేదా కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిల్లో ఉద్యోగం ఉండడంతో వారు ప్రైవేట్‌పైనే మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వాస్పత్రిలో జీతం తీసుకుంటూ ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్‌లో పనిచేస్తున్నారు. సీనియర్ వైద్యులు ఒక్కరు కూడా ఓపీ సేవలు అందించట్లేదు. శిక్షణ వైద్యులతోనే ఓపీ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలు అందించాల్సిన వైద్యులు 11 గంటలకు వచ్చి మధ్యాహ్నం ఒంటి గంటలోపే వెళ్లిపోతున్నారు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఎక్కువ సమయం ప్రైవేట్‌లోనే..

జిల్లా ఆస్పత్రిలో పనిచేసే వైద్యుల్లో మెజారిటీ వైద్యులు ప్రైవేట్‌గా వైద్యం చేస్తుంటారు. కొంతమందికి సొంత ఆస్పత్రులు ఉండగా.. మరికొంత మంది ఇతర ఆస్పత్రుల్లో పనిచేస్తూ ప్రభుత్వ వైద్యాన్ని విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైద్యులకు సీనియారిటీ పెరిగిన కొద్దీ విధులకు డుమ్మా కొట్టడం ఎక్కువవుతుందనే ప్రచారం జరుగుతోంది. ప్రైవేట్‌లో పని లేకుంటేనే ప్రభుత్వాస్పత్రికి వస్తుంటారని సిబ్బందే అంటున్నారు.

కాల్ డ్యూటీస్ పాటించని వైద్యులు..

వైద్యులు సమయానుకూలంగా విధులకు హాజరు కావడం లేదు. అత్యవసర సమయంలో కూడా ఆస్పత్రిలో అందుబాటులో ఉండడం లేదు. ప్రమాదాల్లో గాయపడిన రోగులు సకాలంలో వైద్యం అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్ విధానం ఉన్నప్పటికీ వేలిముద్ర వేసే సమయానికి వచ్చి మధ్యలో వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ఇంటికి వెళ్లే సమయంలో మళ్లీ వచ్చి వెళ్తున్నారు. అయితే బయోమెట్రిక్ పూర్తిస్థాయిలో అమలులో లేకపోవడంతోనే వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

జీఓ నంబర్ 46ను రద్దు చేయాలి

మునగాల(కోదాడ): జీఓ నంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విప్లవరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పోలీసు రిక్రూట్‌మెంట్ మొదటి నుంచీ వివాదంలో కొనసాగుతూ వస్తుందని పేర్కొన్నారు. జీఓ నంబర్ 46తో పలు జిల్లాల అభ్యర్థులు నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలో 53శాతం, ఇతర జిల్లాలకు 47శాతం కేటాయించడం కారణంగా గ్రామీణ ప్రాంత అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. జీఓను రద్దు చేసి నియామక ప్రక్రియను పాత పద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



నాగార్జునకొండకు లాంచీలో వెళ్ల వస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్ : విద్యాసంస్థలకు ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా శని, ఆదివారాలు రెండు రోజులు సెలవులు రావడంతో నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. లాంచీల్లో పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లి.. అక్కడి మ్యూజియంలోని అలనాటి నదీలోయ నాగరికత విశేషాలతో పాటు బుద్ధుడి శిల్పాలు, చైత్యాలు, ఆనాడు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు సాగిన వ్యాపార, వాణిజ్య విశేషాల గురించి తెలుసుకున్నారు. అనంతరం బుద్ధవనంలోని స్థూపపార్కు, బుద్ధచరిత వనం, జాతక కథలపార్కు, మహాస్థూపం, అందులో గల బంగారు వర్ణంతో తయారైన అష్టబుద్ధులను సందర్శించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ధ్యాన మందిరంలో కాసేపు ధ్యానం చేశారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 10వ తేదీ నుంచి 12 వరకు జరగనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కనీస వేతనాలు పొందకుండా సామాజిక బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద పిల్లల కోసం నిరంతరం పని చేస్తున్న ఏజెన్సీల పట్ల తెలంగాణ ప్రభుత్వం అంటీ ముట్టనట్లుగా ఉందని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కోదాడఅర్బన్ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1997–2000 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 ఏళ్ల తరువాత కలుసుకున్న వీరు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఈసందర్భంగా నాటి అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో రంగారావు, రామారావు, రఘు రామయ్య, వెంకటనారాయణ, శ్రీదేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అవసరాన్ని ఆసరాగా తీసుకుని..

- ఈ పంచాయతీ పోర్టల్ హ్యాక్ చేసి ఇంటి యజమాని పేరు, ఇంటి కొలతల్లో మార్పులు చేస్తున్న ఆపరేటర్లు
- మూడు నెలల క్రితం పోర్టల్ నిలిపివేసిన ప్రభుత్వం
- కార్యదర్శులకు తెలియకుండానే మారుతున్న ఆన్‌లైన్ రికార్డులు
- జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 500 దరఖాస్తులకుపైగా ట్యాంపరింగ్



చిలుకూరు: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో 2019లో ఈ పంచాయతీ పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా నూతన గృహ నిర్మాణాల అనుమతులు, ఇంటి యజమాని పేరు మార్పిడి, లేఅవుట్ అనుమతులు, ఆన్‌లైన్‌లో ఇంటి పన్నుల చెల్లింపులు, గ్రామాల్లో వృత్తి వ్యాపార లైసెన్స్‌లతో పాటు గ్రామ పంచాయతీకి సంబంధించిన కరెంట్ బిల్లులు, ప్రభుత్వ అభివృద్ధి పనులపై గ్రామ కార్యదర్శి నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారు. ఈ సేవలకు సంబంధించిన పోర్టల్ యూజర్ ఐడీ, సీక్రెట్ పిన్ గ్రామ కార్యదర్శి, ఈ పంచాయతీ ఆపరేటర్ల వద్ద ఉంటుంది. అయితే ఈ పంచాయతీ పోర్టల్‌లో కొన్ని సేవలను రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలుగా నిలిపివేసింది. ప్రధానంగా గ్రామాల్లో జరిగే ఆస్తి మార్పిడి, ఇంటి యజమాని పేరు, ఇంటి కొలతల్లో మార్పు చేయడాన్ని నిలిపివేసింది.

ఇటీవల కాలంలో..

- చిలుకూరు మండలం కొమ్మబండతండా గ్రామంలో ఇద్దరు వ్యక్తులకు సంబంధించి 110 గజాల స్థలం ఉంది. వీరిలో ఒకరికి 50 గజాల ఇంటి స్థలం ఉండగా.. ఈ పంచాయతీ ఆపరేటర్‌ను మచ్చిక చేసుకొని 50 గజాలు ఉన్న స్థలాన్ని 110 గజాల స్థలం తనకు ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. దీని ఆధారంగా అక్కడ ఉన్న సదరు వ్యక్తి స్థలం కూడా తనదేనని కోర్టును ఆశ్రయించాడు. ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రం ఆధారంగా కోర్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో ఉన్న సదరు వ్యక్తికి లీగల్ నోటీసు పంపించింది.
- కోదాడ నియోజకవర్గ పరిధిలోని అనంతగిరి మండలానికి చెందిన ఒకరు ఇంటి కొలతల మార్పు కోసం గ్రామ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నాడు. ప్రస్తుతం పోర్టల్ సేవలు నిలిపివేయడంతో ఇది చేయడం సాధ్యం కాదని కార్యదర్శి చెప్పాడు. ఆ తరువాత రెండు రోజులకు మధ్యవర్తుల ద్వారా ఈ పంచాయతీ ఆపరేటర్లను మచ్చిక చేసుకుని డబ్బులు ఇచ్చి ఇంటి కొలతల మార్పు చేసుకొని ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.
- సూర్యాపేట మండల పరిధిలో జాతీయ రహదారి పక్కన ఓ వ్యక్తికి 2 గుంటల భూమి ఉంది. సదరు వ్యక్తి ఈ పంచాయతీ ఆపరేటర్‌కు డబ్బులు ఇచ్చి 2 గుంటల భూమిని 10 గుంటలు ఉన్నట్లుగా ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రం తీసుకున్నాడు. సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లగా అనుమానం వచ్చిన రిజిస్ట్రార్ కార్యదర్శికి ఫోన్ చేయగా తాను జారీ చేసిన ధ్రువీకరణ పత్రం కాదని చెప్పడంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయింది.
- తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని విదేశాల్లో ఉన్న వ్యక్తి కార్యదర్శి ప్రమేయం లేకుండానే కొలతలను మార్పు చేస్తూ ధ్రువీకరణ పత్రం పొందాడు. విషయం తెలుసుకున్న కార్యదర్శి ఎంపీఓ, ఎంపీడీఓకు ఫిర్యాదు చేశాడు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ప్రస్తుతం ఈ పంచాయతీ పోర్టల్‌లో ఇంటి యాజమానుల పేర్లు గాని, కొలతలు గాని మార్పులు చేయడానికి వీలు లేదు. ఆపరేటర్లు ఎలా ఆన్‌లైన్ చేస్తున్నారో విచారణ చేస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– ఈదయ్య, ఎంపీడీఓ, చిలుకూరు

రూ.4వేల వరకు వసూలు..

ప్రభుత్వం నూతనంగా గృహలక్ష్మి పథకాన్ని తీసుకురావడంతో గ్రామాల్లో ఇంటి యజమాని పేరు మార్పు కోసం చాలా మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరి అవసరాన్ని ఆసరా చేసుకొని కొంతమంది ఈ పంచాయతీ ఆపరేటర్లు తమకున్న కంప్యూటర్ పరిజ్ఞానంతో పోర్టల్‌ను హ్యాక్ చేయడం ప్రారంభించారు. జిల్లాలో చిలుకూరు, మోతె, మఠంపల్లి, సూర్యాపేట తదితర మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు ఆయా మండలాల్లో పనిచేసే ఆపరేటర్లలతో కుమ్మక్కై, కార్యదర్శుల ప్రమేయం లేకుండా ఇంటి యాజమాని పేరు, ఇంటి కొలతల్లో మార్పులు చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో దరఖాస్తుకు రూ.1500 నుంచి రూ.4000 వరకు వసులు చేస్తున్నారు. మే, జూన్, జూలైలో ఇప్పటి వరకు ప్రతి మండలం నుంచి 20కి పైగా దరఖాస్తులను ట్యాంపరింగ్ చేసినట్లు తెలిసింది. బేతవోలులో ఇటీవల 20 దరఖాస్తులు, జెర్రిపోతుల గూడెంలో 10కి పైగా దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినట్లుగా తెలిసింది. ఇలా జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో 500 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేయగా.. రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు చేతులు మారినట్లు సమాచారం. ఈ వ్యవహారమంతా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తెలియకుండా జరుగుతోంది. దీంతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాము

త్రిపురారం: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన త్రిపురారం మండలం వస్త్రాంతం డా గ్రామపంచాయతీ పరిధిలోని గుడితండాలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ సర్పంచ్ నగార గౌతమి తెలిపిన వివరాల ప్రకారం.. గుడితండాకు చెందిన నగార రాంబాబుకు వ్యవసాయంతో పాటు పశువులు కూడా ఉన్నాయి. పశువుల మేత కోసం తన ఇంటి గోడ వెంట ఏర్పాటు చేసిన గడ్డివాము ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. తండా వాసులు గమనించి నీళ్లతో మంటలను ఆర్పారు. గడ్డివాముకు ఆనుకొని ఉన్న కిటికీలోంచి షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు రవ్వలు ఎగిరిపడి మంటలు చెలరేగినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.30వేలు పెట్టి కొన్న గడ్డి కాలిపోయిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని విష్ణుపురం రైల్వే స్టేషన్ సమీపంలో సికింద్రాబాద్–గుంటూరు రైల్వే మార్గంలో ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైలు నుంచి జారిపడి మహిళ మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలి వయస్సు 35ఏళ్లకు పైన ఉంటుందని, కుడి చేతి మణికట్టుపై మేఘరాజ్ పేరుతో పచ్చబొట్టు ఉందన్నారు. పంజాబీ డ్రెస్ ధరించి క్రీమ్ కలర్ టాప్, గ్రీన్ కలర్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. తల భాగం నుజ్జునుజ్జు కాగా మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఏఎస్‌ఐ నాగరాజు పేర్కొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



ఘటనా స్థలంలో వెంకన్న మృతదేహం

నాగారం: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన నాగారం మండలంలోని పసునూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పసునూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు చిత్తలూరి వెంకన్న(50) రోజుమాదిరిగానే ఆదివారం సాయంత్రం కల్లు గీయడానికి గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కుటుంబం కుల బహిష్కరణ

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాపురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తుడు దుస్సా వెంకటేశ్వర్లు గ్రామంలోని చేపల చెరువు మత్స్యకార సంఘంలో సభ్యుడిగా ఉన్నాడు. చేపల లావాదేవీల విషయంలో తేడాలు రావడంతో ముదిరాజ్ కులస్తులు ఆయన్ని 15రోజుల కిందట కుల బహిష్కరణ చేశారు. అయితే తనను కుల బహిష్కరణ చేసిన విషయం ఈ నెల 2వ తేదీన తెలిసిందని బాధితుడు పేర్కొన్నాడు. తనను శుభకార్యాలకు ఆహ్వానించిన వారికి రూ.2వేల చొప్పున జరిమానా కూడా విధించారని, తన కుటుంబంతో ఎవరూ మాట్లాడవద్దని, ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని తీర్మానం కూడా చేసినట్లు బాధితుడు వాపోయాడు. దీనిపై గ్రామ పెద్దలు కూడా పట్టించుకోకపోవడంతో బాధితుడు నడిగూడెం పోలీసులను ఆశ్రయించాడు. అధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

- కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వారి వద్ద నుంచి 15కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, వెనుక నిందితులు

కేతేపల్లి: ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఆదివారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 15కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నకిరేకల్‌లోని శాలిగౌరారం సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన సీసఉర్దాబ్(23), ఖిల్లా జగత్రే(23), కర్ణ మడ్కామి అలియాస్ కర్ణ(20), మాస కొబాసి(27) ఒక ముఠాగా ఏర్పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణా చేయటం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ నెల 7వ తేదీన ఈ నలుగురు కలిసి ఒడిశాలోని తమ గ్రామాలకు సమీపంలో ఉన్న అడవుల్లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి రూ.3వేలకు కిలో చొప్పున 15కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని హైదరాబాద్‌కు తరలించి అక్కడ కిలో రూ.20వేలకు అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన గంజాయిని 5కిలోల చొప్పున మూడు ప్యాకెట్‌లలో కట్టి లారీలో ఆంధ్రప్రదేశ్ మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరారు. పక్కా సమాచారం అందుకున్న కేతేపల్లి పోలీసులు జిల్లా ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు కేతేపల్లి మండల పరిధిలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీలో ప్రయాణిస్తున్న ఈ నలుగురు ముఠా సభ్యులు పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నిజం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3లక్షల విలువైన 15కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్‌లను కేతేపల్లి తహసీల్దార్ ఎన్. మధుసూధన్‌రెడ్డి సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ముఠాను పట్టుకున్న పోలీసులను డీఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో శాలిగౌరారం సీఐ రాఘవరావు, కేతేపల్లి ఎస్‌ఐ బి. శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది అంజాద్, జానయ్య, మహేష్, రాకేష్, సురేష్, జనార్దన్, రమేష్ పాల్గొన్నారు.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న రెండు లారీలు పట్టివేత



సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్న ధాన్యం లారీలు

గరిడేపల్లి: అక్రమంగా ధాన్యం తరలిస్తున్న రెండు లారీలను గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో పోలీసుల సహకారంతో సివిల్ సప్లయ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. వివరాలు.. గడ్డిపల్లిలోని శ్రీహనుమాన్ శివసాయి రైస్ మిల్లుకు ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మిల్లు నిర్వాహకులు స్థానికంగా ఓ పొలంలో నిల్వ చేశారు. ఆ ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం పోలీసుల సహకారంతో సివిల్ సప్లయ్ అధికారులు దాడి చేసి రెండు లారీలను సీజ్ చేశారు. ఈ విషయంపై సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మిని వివరణ కోరగా.. ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ధాన్యాన్ని తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నామని తెలిపారు. సోమవారం టెక్నికల్ టీం ద్వారా శాంపిల్స్ సేకరించి పంచనామా నిర్వహించి మిల్లు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని ఆమె పేర్కొన్నారు.

చందంపేటలో పీడీఎస్ బియ్యం..

చందంపేట: ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం చందంపేట మండలంలోని గన్నెర్లపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండల పరిధిలోని మూడుదండ్ల గ్రామానికి చెందిన దామెర శ్రీను గన్నెర్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో 5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఇంటిపై దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒంటరితనం భరించలేక వృద్ధురాలు ఆత్మహత్య

కొండమల్లేపల్లి: ఒంటరి జీవితంతో విసుగు చెందిన ఓ వృద్ధురాలు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన బోడ మల్లమ్మ(75) భర్త 50 ఏళ్ల క్రితం, కుమారుడు 30 ఏళ్ల క్రితమే చనిపోయారు. దీంతో ఆమె ఒంటరిగా జీవిస్తోంది. ఒంటరితనాన్ని భరించలేక ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్‌ఐ వీరబాబు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

కృష్ణారెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- ఉద్యమ సహచరుడికి కన్నీటి వీడ్కోలు



కృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): తనతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేసిన ఆత్మకూరు (ఎస్) మండలం బొప్పారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత పగడాల కృష్ణారెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణారెడ్డి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతిచెందారు. బొప్పారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలకు మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరై కృష్ణారెడ్డి భౌతికకాయాన్ని చూసి కంటతడి పెట్టుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో తన వెంట నడిచిన కృష్ణారెడ్డి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర గీత కార్మికుల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, ఎంపీపీ స్వర్ణలతాచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తూడి నర్సింహారావు, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, బీసీ సెల్ మండల ప్రెసిడెంట్ బ్రహ్మంగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



సాయి (ఫైల్)

గరిడేపల్లి: లారీ ఢీకొని బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతిచెందిన ఘటన గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన పోలగాని సాయి(24) హుజూర్‌నగర్‌లోని శ్రీనివాస బైక్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో పని చేస్తున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం సాయి ఆదివారం తన స్నేహితుడు పిసం శంకర్‌తో కలిసి బైక్‌పై కీతవారిగూడెం వెళ్లి తిరిగి వస్తుండగా రాయినిగూడెం గ్రామ శివారులోకి రాగానే బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ టైర్లు సాయి తల పైనుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందగా.. బైక్‌పై వెనుక కూర్చున్న శంకర్ పక్కనే ఉన్న పొలాల్లో ఎగిరి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సాయి రెండేళ్ల క్రితం రాయినిగూడెం గ్రామానికి చెందిన దివ్య అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, 9 నెలల బాబు ఉన్నారు. విషయం తెలుసుకున్న గరిడేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విధులు నిర్వహిస్తూ అపస్మారక స్థితిలోకి ఉద్యోగి

- యాదాద్రి ఆలయంలో ఘటన



108 వాహనంలో వెంకటేష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రచార శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఆదివారం ఉదయం ఉన్నట్టుండి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానిక ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ ప్రచార శాఖలో విధులు నిర్వహించే వెంకటేష్ రోజుమాదిరిగా ఆదివారం ఉదయం సుమారు 10.10గంటల సమయంలో ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆలయాధికారులు, సిబ్బంది గుర్తించి 108 వాహనంలో వెంకటేష్‌ను భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గుండె పక్క భాగంలో నొప్పి రావడంతో కిందపడిపోయినట్లు వెంకటేష్ వైద్యులకు చెప్పాడని 108 వాహన సిబ్బంది వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆలయ ఉద్యోగులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- మరో ముగ్గురికి గాయాలు

భువనగిరి: కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందాడు. ఇదే ప్రమాదంలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి భువనగిరి మండల పరిధిలోని ముస్తాలపల్లి గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం అనాజీపురం గ్రామానికి చెందిన కొల్లు రామకృష్ణ (32), బుజిలాపురం గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు నర్సింహతో కలిసి బైక్‌పై భువనగిరి మండలంలోని రాయగిరి నుంచి మోత్కూరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి మండల పరిధిలోని ముస్తాపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా నర్సింహకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న భువనగిరి పట్టణానికి చెందిన డొప్ప రమేష్, అతడి తల్లి సత్తమ్మను కూడా ఢీకొట్టడంతో వారిద్దరికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరిలో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గాయాలైన వారిని కూడా అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



అఫ్రిద్ (ఫైల్)

చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ సతీష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారం గ్రామానికి చెందిన షేక్ అఫ్రిద్(23) ఈ నెల 6వ తేదీన గడియగౌరారం నుంచి చింతపల్లికి బైక్‌పై వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో అదుపు తప్పి బైక్ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. అఫ్రిద్ తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం మాల్‌లోని పీపుల్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తల్లి షేక్ సాధికాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి పైనుంచి జారిపడి..

చౌటుప్పల్: ఇంటి పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన జక్కుల లక్ష్మణ్(42) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఇంటి నిర్మాణ పనుల్లో ఉండగా శనివారం మొదటి అంతస్తు రేలింగ్ వద్ద నుంచి జారిపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ధనుంజయ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

డిండి: వ్యవసాయ భూమి పంపిణీ విషయంలో చోటు చేసుకొన్న ఘర్షణలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం డిండి మండలం ఎర్రారం గ్రామపంచాయతీ పరిధిలోని జాల్‌తండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జాల్‌తండాకు చెందిన రాత్లావత్ జగన్, లక్ష్మ, పత్యా, హర్యాకు అదే గ్రామానికి చెందిన వర్గం, గాంసీరాం, దుద్యా, బుద్యా మధ్య గత కొన్నిరోజులుగా భూమి చాయితీ జరుగుతోంది. ఆదివారం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా ఒక వర్గంపై మరో వర్గం దుర్భాషలాడుతూ దాడి చేసుకున్నారు. దీంతో పంచాయితీ పెద్దగా వ్యవహరిస్తున్న మాజీ ఎంపీపీ రాత్లావత్ వెంకట్రాంతో పాటు మరో ఇద్దరి వ్యక్తులకు గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

మర్రిగూడ: మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిపంగి శ్రీనివాస్ మర్రిగూడ నుంచి రాంరెడ్డిపల్లి గ్రామానికి శనివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలో అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మర్రిగూడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని హస్తినాపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్‌ను పరామర్శించారు. వైద్య ఖర్చులను తానే భరిస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట బేత వెంకటేష్, ఏరుకొండ రాము ఉన్నారు.

బైక్ అదుపుతప్పి గాయాలు..

కేతేపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బర్లపెంట బజారుకు చెందిన అక్కెనపల్లి జానయ్య ఆదివారం సాయంత్రం నకిరేకల్ నుంచి బైక్‌పై సూర్యాపేటకు బయల్దేరాడు. ఈ క్రమంలో కేతేపల్లిలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే బైక్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న జానయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ దుర్మరణం

మునగాల: మండలంలోని మొద్దులచెరువు శివారులో ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై రెండు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి సూర్యాపేట వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టి రోడ్డు మధ్యలో ఆగిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి మరో సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక నుంచి ఢీకొట్టిన లారీ క్యాబిన్‌లో డ్రైవర్ గోపి(40) ఇరుక్కుపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో క్యాబిన్‌లో నుంచి డ్రైవర్‌ను బయటకు లాగారు. డ్రైవర్ గోపికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందినట్లు ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కుందూరు జానారెడ్డి

పెద్దవూర: తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి విమర్శించారు. ఆయన తనయుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి గత నెల 14వ తేదీన చేపట్టిన గిరిజన చైతన్య యాత్ర నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని 109 తండాల మీదుగా 208 కిలోమీటర్లు పూర్తి చేసుకుని పెద్దవూర మండలంలోని చింతపల్లితండాలో ఆదివారం ముగిసింది. ఈ యాత్ర ముగింపు సభకు జానారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం తెచ్చింది, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును నలభై ఏళ్లయినా పూర్తి చేయలేరని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 170 గిరిజన తండాలకు కరెంట్‌ను ఇచ్చింది తానే అని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే అని, అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, పేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణం వంటి హామీలు అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, చంద్రారెడ్డి, వినయ్‌రెడ్డి, పబ్బు యాదగిరి, గౌనీ రాజారమేష్, బైకాని లక్ష్మయ్య, ఆంజనేయులు, వంశీ, చామల సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు..

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పెద్దవూర మండలంలోని చింతపల్లి గ్రామ ఎంపీటీసీ జటావత్ జ్యోతికృష్ణ, తిరుమలగిరి సాగర్ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పుట్లూరు రాజశేఖర్‌రెడ్డితో పాటు చింతపల్లితండాకు చెందిన వంద మందికి పైగా ఆదివారం రాత్రి జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి జానారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విత్తనశుద్ధితో తెగుళ్లు అదుపు

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు

పాడి పంట



పెసర విత్తనశుద్ధి చేస్తున్న రైతు

నడిగూడెం : ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభంకావడంతో రైతులు సాగు పనులు మొదలుపెట్టారు. ఈ సమయంలో బోర్లు, బావుల క్రింద వరి నార్లు పోసుకోవడం, కంది, పెసర, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలు సాగు చేస్తుంటారు. రైతులు విత్తనశుద్ధి చేస్తే తెగుళ్లు అదుపులో ఉంటాయని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు తెలిపారు. విత్తనశుద్ధికి సంబంధించిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

» **వరిలో విత్తనశుద్ధి:** మెట్ట నారు మడులకు అయితే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దమ్ము చేసిన నారుమడైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజమ్‌ను కలిపి ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి తరువాత 24 గంటలు మండెకట్టి మొలకలను దమ్ము నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు మందు ద్రావణం సరిపోతుంది.

» **మొక్కజొన్నలో:** కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరం, లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసినట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు. బూజు తెగులు ఆశించు ప్రాంత రైతులు కిలో విత్తనానికి 4 గ్రాముల మెటలాక్సిల్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.

» **కందిలో:** మొదటగా విత్తనాలకు థైరమ్ లేదా కాప్టాన్ ఒక కిలో విత్తనానికి 3 గ్రాముల చొప్పున పట్టించాలి. ఆ తర్వాత విత్తుకొనే ముందు 200 నుంచి 400 గ్రాముల రైజోబియంను ఎకరం విత్తనానికి కలిపి విత్తుకోవాలి.

» **పెసరలో:** కిలో విత్తనానికి 30 గ్రాముల కార్బోసల్ఫాన్ మందును వాడి విత్తనశుద్ధి చేయాలి. కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేక 5 గ్రాముల థయోమిథాక్సమ్ కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే సుమారు 15 నుంచి 20 రోజుల వరకు రసం పీల్చు పురుగుల బారి నుంచి రక్షించుకోవచ్చు.

» **వేరుశనగలో:** కిలో విత్తనానికి 1.0 గ్రాము టెబ్యుకొనజోల్, 3 గ్రాముల మ్యాంకోజెబ్ పొడి మందును పట్టించాలి. కాండంను కుళ్లు తెగులు ఆశించే ప్రాంతాలలో కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేయాలి. వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 2 మి.లీ. ఇమిక్లోప్రిడ్ చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి.

» **ఆముదంలో:** కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ పొడి మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఇలా చేయడం వలన మొలక కుళ్లు తెగులు, ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు మరియు కొంతవరకు వడలు తెగులును అరికట్టవచ్చు. వడలు తెగులు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 3 గ్రాములు కార్బెండిజమ్ లేదా 10 గ్రాములు ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలి.